


# చుట్టమొచ్చి...

కాటూరు రవీంద్ర-త్రివిక్రమ్

వీధి "తలుపు చప్పుడవుతోంది. వెళ్ళి చూసిరా కామాక్షీ ..." వరలక్ష్మి వంకాయ ముక్కలు తరుగుతూ కూతురికి పురమాయించింది. చేతిలోవున్న వారపత్రిక క్రింద పెట్టి సణుక్కుంటూ వెళ్ళి తలుపుతీసి నిర్ఘాంతపోయింది.

"ఎవరండీ....మీరు?" అంది కళ్ళు రెపరెపలాడిస్తూ.

చేతుల్లో సూట్‌కేసు, హాండ్‌బ్యాగులతో భార్యా భర్తలూ, యిద్దరూ పిల్లలూ గుమ్మంలో నిల్చుని ఉన్నారు. వాళ్ళ నేనాడూ చూసిన జ్ఞాపకంలేదు పదహారేళ్ళ కామాక్షికి.

"సీతారాం యిల్లు యిదేనా?"

"వారు మా నాన్నగారే! రండి లోపలికి" అంటూ ఆహ్వానించింది.

వాళ్ళకంటే మునుపే పరుగెత్తుకొచ్చి తల్లి చెవిలో "అమ్మా ఎవరో చుట్టాలొచ్చారే" అంది గాభరాగా.

నీరుకారిపోతూ "చుట్టాలా?!" అంది వరలక్ష్మి. సగం తరిగిన వంకాయ అలాగే చేతులమధ్య ఉండిపోయింది. "ఈ కరువు రోజుల్లో...." అనుకుంటూండగానే వాళ్ళొచ్చేసారు లోపలికి.

"వరాలూ! నేనోయ్ శ్రీపతిని" అంటూ చనువుగా వంటింటి గుమ్మం దగ్గరికి వచ్చాడు అతను. వరలక్ష్మి దిగ్భ్రాంతితో వెనుదిరిగి "అరే....నువ్వట్రా అన్నయ్యా" అంది సంతోష సంభ్రమాలతో.

కామాక్షి కళ్ళప్పగించి చూస్తూండిపోయింది.

"ఏం వదినా, కులాసాగా ఉంటున్నారా?" అంటూ పలకరించింది శ్రీపతి భార్య.

"ఏవమ్మా సుభద్ర వదినా, బొంబాయి వెళ్ళినా వళ్ళు చెయ్యలేదేమిటి?" అంది

ఛలోక్తిగా.

"బొంబాయి నీళ్ళల్లో టానిక్కేమన్నా కలుపుతారని చెప్పారేమిటి నీ కెవరన్నా?" అన్నాడు శ్రీపతి నిండుగా నవ్వుతూ.

"లేదులేరా. ఎలాగైనా పై వూళ్ళు వెళ్ళినవాళ్ళు వళ్ళుచేసో, రంగు తిరిగో రావటం రివాజయ్యె" అంది వరలక్ష్మి.

"అదృరేగానీ, సీతారాం బావ ఏడీ?"

"ఆఫీసునుండి యింకా రాలేదు. వచ్చే వేళయింది. నిల్చోబెట్టే మాట్లాడుతున్నాను. ఒసేవ్ కామాక్షీ, అలా మొద్దులా చిప్పలా నిల్చోపోతే మామయ్యకో కుర్చీ వెయ్యకూడదూ?" అని గదమాయించింది కూతుర్ని.

"ఆ....దానికేం తెలుసులెద్దూ చిన్నపిల్ల. అయినా, పరాయి వాడికిలాగ నాకు మర్యాదలేమిటి? ఆ పీట యిలా పడెయ్యి కూర్చుంటాను" అంటూ తనే లాక్కుని కూర్చున్నాడు.

కామాక్షి తెగ సిగ్గుపడిపోయింది.

తల్లితో యింత చనువున్న మామయ్య గురించీ, తన కసలు బొత్తిగా తెలియనందుకు చాలా విచారం కలిగింది. తనకు ముందుగా చెప్పనందుకు తల్లిమీద కోపం కూడ వచ్చింది. ఇందాక సగంలో వదిలేసిన వారపత్రికలో సీరియల్ జ్ఞాపకానికొచ్చి వాళ్ళ మధ్యలోంచి వెళ్ళి గదిలో కూర్చుంది, పుస్తకం ముందేసుకుని.

ఒక పేజీ చదివిందో లేదో శ్రీపతి కూతురు పన్నెండేళ్ళదీ, కొడుకు పదేళ్ళవాడూ వచ్చి మొహంలోకి చూస్తూ నిల్చున్నారు. తలెత్తి చూసింది. వాళ్ళ కళ్ళల్లో స్నేహాభిలాష గోచరించింది.

"నీ పేరు ఏమిటమ్మడూ?"

"ఇందుమతి"

"నీ పేరు?"

"సుధాకర్..." చలాకీగా సమాధానం చెప్పాడు.

"ఏం చదువుతున్నారు?"

"నేను టెన్త్. వీడు సెవెన్త్."

"కూర్చోండి"

యిద్దరూ మంచంమీద కూర్చున్నారు. వాళ్ళ మొహాల్లో చిరునవ్వు. కామాక్షికి వాళ్ళతో యింకేమి మాట్లాడాలో అర్థం కాలేదు. మనసు కథమీదకి పీకుతున్నా, 'పిల్లలతో మాట్లాడకపోతే బావుండదు' అనే సందిగ్ధంలో బలవంతాన బొంబాయి గురించి తెలిసీ, తెలియని ప్రశ్నలు వేసింది. ప్రతి ప్రశ్నకీ చక్కగా సమాధానాలు చెప్పారు. వాళ్ళ మాటలెంత ముచ్చట గొలిపినాయి కామాక్షికి. వాళ్ళకబుర్లమధ్య వాళ్ళకి బి.టెక్.చదువుతున్న 'శ్రీకాంత్' అనే అన్నయ్యఉన్నట్లు తెలుసుకుని తెల్లబోయింది.

"అయితే మామయ్యకీ, అత్తయ్యకీ పెళ్ళీడు కొచ్చిన కొడుకున్నాడన్నమాట?!" అనుకుంది మనస్సులో. "వాళ్ళ కంత వయసున్నట్లే కనిపించరు!" అని ఆశ్చర్యపోయింది.

పిల్లలకి కాస్త కొత్త వదలి కబుర్లలో పడ్డారు. కామాక్షి మాత్రం 'శ్రీకాంత్' గురించి వూహించుకుంటోంది. "అత్తయ్య, మామయ్య, పిల్లలిద్దరూ ఎర్రగానే ఉన్నారు కాబట్టి, శ్రీకాంత్ కూడ ఎర్రగా ఉండొచ్చును...." అనుకుంటూ తను చూసిన కుర్రాళ్ళల్లో అందంగా వున వాళ్ళతో పోల్చుకుని శ్రీకాంత్ రూపాన్ని వూహించుకో సాగింది. మరికాస్సేపు సినిమా హీరోలతో కూడ పోల్చుకుంది!

అంతలో భోజనాలకి పిలుపు రావటంతో, వడ్డన ఏర్పాట్లకోసం వంటింట్లోకి వెళ్ళింది. ఆసరికి సీతారాం వచ్చి శ్రీపతితో భేటీ వేసుక్కూర్చున్నాడు. సుభద్ర కూడ చనువుగా కలిసిపోయి, వద్దు వద్దంటున్నా వినకుండా తను కూడా వడ్డనకి దిగింది. మగవాళ్ళు, పిల్లలూ భోజనాలు చేసిన తర్వాత ఆడవాళ్ళు కూర్చున్నారు.

"ఏమిటోనమ్మా సుభద్ర వదినా! వాడు మా పిన్ని కొడుకేగానీ, సొంత అన్నయ్య కంటే ఎక్కువ ఆపేక్షగా ఉంటాడు. మాకు కూడా ఆ భేదాలులేవు. వాడు ఒక్కగా నొక్క కొడుకు. చదువులో రత్నం. వాడి చదువు మద్రాసులో, విదేశాల్లో కావటంవల్ల నీ పెళ్ళికి చూట్టమేగానీ, మళ్ళీ నా పెళ్ళితో నేను మన వాళ్ళం దర్నీ వదిలి యిటు వచ్చిం తర్వాత చూసింది లేదు! అబ్బ.....ఎన్నాళ్ళయిందనీ...... మిమ్మలి మళ్ళీ చూస్తుంటే యింకో జన్మలా ఉంది నాకు...."

వరలక్ష్మి మాటలకి మందహాసం చేసింది సుభద్ర.

"నువ్వు కూడ చంద్రుడికి వెన్నెలలా వాడికి తగ్గదానివి. మరో ఆడపడుచయితే, వాడి హోదాకి ఎంత అహంభావమన్నా చూపేది"

"చాల్లే వదినా! మరీ పొగిడేస్తే కడుపు నిండిపోయి అన్నం సయించదు. పైగా, నీ వంట కూడ అద్భుతంగా ఉండి, వదల బుద్ధికావటం లేదు" అంది సుభద్ర.

వరలక్ష్మి నోరారా నవ్వింది, "నువ్వు మాత్రం ఏం తక్కువలే" అన్న అర్థంతో. కామాక్షి మౌనంగా వాళ్ళ సంభాషణ విన సాగింది.

*　　*　　*

"కరువులో అధికమాసమని అసలే అప్పులబాధతో చస్తుంటే వీళ్ళొచ్చి పడ్డారేమిటి కొంపమీద?"

"సర్లెండి, మెల్లగా మాట్లాడండి వినగలరు! మన కొంపకిది షరా మామూలేగా! క్రిందటి నెలలో మీ తమ్ముడి కుటుంబంవచ్చి, ఆవిడకి వైద్యమని చెప్పి నానాయాగీ చేసి, రెండొందల అప్పులు చేయించి మరీ వెళ్ళారు. ఇప్పుడు వీళ్ళు! ఎలా కాదంటాం చెప్పండి? మన మధ్యతరగతి కుటుంబాల కొచ్చిన ప్రమాదమే యిది. ఇదెక్కడి శాపమో, ఈ చుట్టాలు కూడ పని గట్టుకుని మన కొంపలమీదే వాలతారు. డబ్బున్నవాళ్ల కొంపల కెళితే నౌకర్లచేత మాట్లాడిస్తారు. ఇక్కడ చింపిరితలలతో, మాసిన చీరలతో మనమే దేభ్యాల్లా దర్శనమిచ్చి వెళ్ళమనలేక 'రండి.. రండి....' అంటూ ఆహ్వానాలు పలుకుతాం"

"నాకు రావాల్సిన ప్రమోషను కూడా సమయానికి రాకుండా ఏడిపిస్తోంది వరాలూ. లేకపోతే నా కింత బాధలేకపోను. ఆ పైవాడికి 'రికమండేషన్' చేసే నాథుడు దొరకలేదు. డబ్బులివ్వటం మనవల్ల ఎలాగూ కాదనుకో, అంతా అగమ్యంగా ఉంది. దీనికితోడు కామాక్షి పెళ్ళి ఒకటి" తలపట్టుకుని గాఢంగా నిట్టూర్చాడు.

"సరే యిది మనకి ఎప్పుడూ ఉండే భాగోతమేగా! చాలా పొద్దయింది పడుకోండి. మళ్ళీ ప్రొద్దున్నే లేవాలి"

సీతారాం బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు.

[illegible]

జానవుల్లా ఆయుధాలతో నిలబడి "మా డబ్బు, మా డబ్బు" అంటూ గర్జిస్తున్నారు. మరో ప్రక్క పెళ్లికూతురు దుస్తుల్లో కామాక్షి నిలబడి ఉంది. ఆమె చేతిలో వున్న పళ్లెంలో "కట్నం" అన్న అక్షరాలు మెరుస్తున్నాయి. ఆమె కాటుక కళ్లనుండీ ముత్యాలు జారుతున్నట్టు కన్నీళు . మూడో ప్రక్క నిలువుటద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు సీతారాం. చింపిరి జట్టు. గుంటలు పడిన కళ్లచుట్టూ నల్లటి చారలు. మాసిపోయి, అతుకులతో ఉన్న బట్టలు. "ఏమిటీ, యీ అవతారం నాదేనా?" అనుకుంటూ ఉలిక్కిపడ్డాడు. వెనకాల రిక్షాలు ఆగిన శబ్దం. అదిరిపడి అటు చూసేడు. పెళ, పెళలాడుతున్న పట్టు చీరలు, నగలు పెట్టుకుని రిక్షాలు దిగుతున్నారు చుట్టాలు. సూట్లు, పంచెలు కట్టుకుని మగవాళ్లు, అందరూగుంపుగా వస్తుంటే, కళవళపడిపోతూ "రాకండి.... రాకండి....ఆగండి" అని అరిచాడు.

వరలక్ష్మి అదిరిపడి లేచింది. సీతారాం కూడ లేచాడు.

"వరాలూ! హో గ్లాసుతో నీళ్లివ్వు" అన్నాడు. ఆమె అర్థం చేసుకుని నీళ్లి

# చుట్టమై వచ్చి...

చ్చింది. గట, గట త్రాగి పడుకున్నాడు.

హాయిగా నిద్ర పట్టింది.

* * *

"సీతారాం! మేమిక్కడ ఒక వారం ఉండదల్చిచాముర్రా. అయితే ఒక్క షరతు మీద. మేం ఎలా వున్నా, ఏమి చేసినా మీరు అభ్యంతరాలు పెట్టకూడదు. మా ఆత్మీయత కది గౌరవంగా తలుస్తాం. లేదంటే వెళ్లి, ఏదన్నా హోటల్లో ఉంటాం."

సీతారాంకి మాటలు పెగల్లేదు. వరలక్ష్మికేసి సాయం కావాలన్నట్లు చూసేడు.

"నువ్వెన్నాళ్లుంటే మాత్రం ఎవరు కాదంటార్రా? నీ వెలా ఉన్నా మాకు అభ్యంతరాలుండవ్. సరేనా?" అంది వరలక్ష్మి.

"వెరీగుడ్! ఆమాటమీదనే నిలబడు" అని శ్రీపతి, సీతారాం భుజంమీద చెయ్యి వేసి బయటకు లాక్కుపోయేడు.

'రేయ్, నేను కూరల బజారుకి వెళ్తున్నా. క్లబ్బుకి కాదుసుమా!''అన్నాడు సీతారాం, పరాచికంగా.

"నేను కూరలసంచీనే పుచ్చుకున్నాను టెన్నిస్ రాకెట్‌ని కాదుసుమా!" అన్నాడు శ్రీపతి ప్రతిగా.

"నువ్వు తెస్తున్న సంచీ కూరలకా?"

"అబ్బే....క్లబ్బుకి!"

"నువ్వు...."

"ష్! షరతులు ముందరే చెప్పాను. ఇహ ఎదురు మాట్లాడితే కొడతా".

సీతారాంకి ఏమి మాట్లాడాలో తోచ లేదు. శ్రీపతి పెట్టిన షరతు కిది తాత్పర్యం అని మొదట అర్థం కాలేదతనికి. అపార్థం కూడ చేసుకున్నాడు. కానీ, యిప్పుడు 'శ్రీపతి' కూరల బేరానికి తయారైతే. అతనికేదో చిన్నతనమనిపించింది. వారిద్దామనిపించింది కానీ, 'పోన్లే యిదీ చూద్దాం' అని మిన్నకున్నాడు.

మార్కెట్టంతా తిరిగి మోయలేనన్ని కూరలు బేరం చేసాడు శ్రీపతి. సీతారాం నోరు మెదపకుండా తన దగ్గర సంచులు నిండేవరకు కూరలు పోయించుకుంటూ అతనివెంట నడిచాడు. చివరకి శ్రీపతి సంచీ కూడా కూరలతో, పళ్లతో నిండింది. రిక్షా కేకేసి సంచులందులో పెట్టించి, ఇంటిదారి పట్టాడు శ్రీపతి. బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నాడు సీతారాం.

వీళ్లు వెళ్లేసరికి సుభద్ర వంటపనిలో ఉంది! ఇందుమతి ప్రెషర్‌కుక్కర్లో పప్పు వగైరాలు పోస్తోంది. సీతారాం ఆశ్చర్యంగా "యిదెక్కడిది?" అనబోయి మళ్లీ వూరుకున్నాడు.

వరలక్ష్మి చెప్పింది. "బొంబాయినుంచీ బహుమతిగా తెచ్చారని" ఆమాట అంటున్నప్పుడు తొణికిసలాడిన ఆనందం ప్రస్ఫుటంగా కానవచ్చింది సీతారాంకి.

"అలాగా?" అన్నాడు క్లుప్తంగా.

సుధాకర్ తండ్రి చేతుల్లోంచి సంచులు తీసుకుని, 'రా వదినా' అని కామాక్షిని పిలిచి ఏ రకాని కా రకం వేరుచేసి, కూరల బీరువాలో సర్దాడు. అది నిండిపోయింది.

వరలక్ష్మి అన్ని కూరలు చూసి తెల్లబోతూ "యిదేమిటి, మనింట్లో ఏమన్నా సంతర్పణ అనుకున్నారేమిటండీ, ఇన్నికూరలేం జేసుకోనూ...." అంటుంటే "ష్" అని వారించి "అదంతా మీ అన్నయ్య శ్రీపతి...." అన్నాడు.



"అదేమిట్రా - అన్నయ్యా..." అని ముక్కుమీద వేలేసుకుని ఏదో అనబో తున్న వరలక్ష్మిని వారించి "మన షరతు మర్చిపోకు" అని హెచ్చరించి గదిలోకి వెళ్లిపోయాడు శ్రీపతి....

"బాగానేవుంది" అనుకుంది వరలక్ష్మి.

"నీ కెందుకమ్మా వదినా బెంగ? నువ్వు అలా కూర్చో నేను చేసి పెడతాను కద? మా బొంబాయి వంటలు రుచి చూడు" అంది సుభద్ర. వరలక్ష్మి కళ్లు ఆర్ద్రమై నాయి. "వీళ్లకి అరవ చాకిరీచేసి నడుం విరగ్గొట్టుకోవాలేమోనని భయపడింది తను. కనీసం చిన్న మెత్తు పని కూడ ముట్టుకో నియ్యడం లేదు వీళ్లు. మా మరిది కుటుం బానికీ వీళ్లకీ ఎంత తేడా! చుట్టాలందరూ యింత కలుపుగోలుగా, ఆత్మీయంగా ఉంటే 'చుట్టమై వచ్చి దెయ్యమై కూర్చున్నా డన్న' సామెత ఉండకపోయేది గద?" అనుకుంది వరలక్ష్మి మనసులో.

ఏ గృహిణి బాధపడినా యిదే. ఏమధ్య తరగతి కుటుంబీకుడు భయపడినా పిశా చాల్లా పీక్కుతినే బంధువుల గురించే. శ్రీపతి కుటుంబం మాత్రం సరిక్రొత్త పంథాలో సీతారాం కుటుంబానికి బరువు లేకుండా మసలసాగేరు.

శ్రీపతి కొడుకు సుధాకర్ మరచి పోలేక కున్రాడు. ఆ ఇంట్లో కూసాలు విరిగిన రెండు పాత మంచాల్నీ, కాలు విరిగిన కొయ్య కుర్చీని బాగు చేసాడు! తండ్రిచేత తీగ అల్లిక తెప్పించి వంటింటి కిటికీలకు బిగించి, ఈగలు రాకుండా చేసాడు. ఇందు మతితో కలిసి దొడ్లో కూరగాయలు, పూలమొక్కలు పాతాడు. కామాక్షి కూడ ఉషారుగ వాళ్లతో పాల్గొంది.

ఇప్పుడా యింట్లో చుట్టాలంటే బెదురు పోయింది.

శ్రీపతి రాకతో యింటి ఖర్చులు తగ్గాయి. చాలావరకు అతను ఖర్చు పెట్టటంవల్ల సీతారాంకి ఆర్థికమైన వత్తిడి తగ్గింది. ఇంట్లో రోజూ పుష్టికరమైన ఆహారం తినటంతో వరలక్ష్మిలో నీరసం, బలహీ నత పోయి చురుకుదనం, ఆరోగ్యం మూర్తీ భవించాయి. కామాక్షి క్రొత్త వంటలు నేర్చుకుంది సుభద్ర దగ్గర. అల్లికలు, కుట్టుపనులు కూడ నేర్చుకుంది.

వారం రోజులు చిటికెలో అయి పోయాయి!

రేపు వెళతారనగా ఈరోజు సీతారాంని పిలిచి అన్నాడు శ్రీపతి.

"రేపు నువ్వు ఆఫీసుకెళ్లగానే ప్రమో షను ఆర్డరు చేతిలో పడుతుంది. నా కిక్కడ వున్న సొంత పనుల్లో అది కూడ ఒకటిగా వేసుకున్నాను. పోతే, వరలక్ష్మికి చిన్నప్పుడు ఒక వాగ్దానం చేసాను. దానితో వియ్యం పొందుతానని! ఇన్నాళ్లా మా సుభద్ర, కోడలు తెలివి తేటల్ని చురుకు దనాన్ని పరీక్ష చేసింది. మీ అమ్మాయి పరీక్షలో ప్యాసయింది. అంటే మా శ్రీకాంత్ గాడికి పెళ్లాం అయిందన్నమాట!"

"ఏమిటి, మూడు ముళ్లు వెయ్య కుండానే?" అంది నవ్వుతూ సుభద్ర.

"ఆ ముళ్లేమిటో నువ్వే వేసేద్దూ నీ కొడుకు నీ మాట కాదంటాడా?" అన్నాడు శ్రీపతి. కామాక్షి కెంపులయిన బుగ్గలతో రివ్వున అవతలకి పారిపోయింది.

"రేయ్, మాకు మీ దంపతుల ఫోటో కావాల్రా" అన్నాడు సీతారాం.

"ఎందుకుట?" అన్నాడు శ్రీపతి సీరి యస్‌గా.

"చుట్టాల్లో దెయ్యాలేకాదు, దేవుళ్లు కూడా ఉంటారని ప్రపంచానికి చాట టానికి!"

నవ్వులతో ఆ యిల్లు ప్రతిధ్వనించింది. ●


